AUCHITHYAM
International Research Journal for Telugu Language & Literary Studies
ISSN: 2583-4797
UGC-CARE listed Journal
Publishing by: Dr. Rambhatla Parvatheeswara Sarma, Dr. RVRM Trust, 12-121/17, Flat No. 402, Satyanagar, Chinamusidiwada, Pendurthy, Visakhapatnam-531173. AP, India. +91 9247859580.

AUCHITHYAM UGC-CARE Listed Journal | Volume-4 | Issue-14 | December 2023 | ISSN: 2583-4797

Article Link: https://www.auchithyam.com/2023/dec_2023/full_papers/december23_01.php

DOI:

# 1.‘ఆచార్య ముదిగొండ’ సాహిత్యవిమర్శ: మౌలికాంశాలు



**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

అధ్యక్షులు, తెలుగుశాఖ, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్,

యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్,

హైదరాబాద్-500 046, తెలంగాణ.

సెల్: +91 9989628049. Email: darlash@uohyd.ac.in

**వ్యాససంగ్రహం:**

*ప్రముఖ తెలుగు సాహిత్యవిమర్శకులలో ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య ఒకరు. తెలుగు సాహిత్య-విమర్శకు ఆయన అందించిన మౌలికకృషిని పరిచయం చేయడం ఈ వ్యాసప్రధానలక్ష్యం. పాశ్చాత్యసాహిత్య-విమర్శకు I. A. Richards (1893–1979) తన The Principles of Literary Criticism (1924), Practical Criticism (1929) గ్రంథాలలో ప్రతిపాదించిన సాహిత్యవిమర్శ మౌలికాంశాలు ఆంగ్లసాహిత్యవిమర్శను ఎంతగానో ప్రభావితం చేశాయి. అటువంటి కృషి తెలుగులో ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య చేశారు. ‘విమర్శ-మౌలికలక్షణాలు’ (1990), ‘కళాతత్త్వశాస్త్రం -తులనాత్మక అధ్యయనం (1993), ‘సాహిత్యవిమర్శ: సూత్రం-అన్వయం’ (1998) ‘అనువర్తిత విమర్శ- విలువల నిర్ణయం’ (1999) మొదలైన గ్రంథాలు ఆయన విమర్శరంగానికి అందించిన మౌలికాంశాలను తెలుపుతాయి. దీనితో పాటు సాహిత్యవిమర్శకున్న శాస్త్రప్రతిపత్తినీ, భారతీయాలంకారిక-సిద్ధాంతాల కొనసాగింపు తెలుగు సాహిత్యవిమర్శపై కనిపించే విధానాన్నీ, అలంకారం, ధ్వనీ ప్రతీకలు, భావచిత్రాలుగా మారినప్పుడు అనుసరించాల్సిన విమర్శ పద్ధతులను శాస్త్రీయంగా నిరూపించారు. వాటిలో కొన్నింటిని ఈ వ్యాసంలో వివరించడంతో పాటు, ఆచార్య వీరభద్రయ్య కవిత్వం, కథానిక, నవలాప్రక్రియలపై చేసిన మరికొన్ని విమర్శమౌలికాంశాలను కూడా తెలుసుకుంటారు.*

**Keywords:** సాహిత్యవిమర్శ, మౌలికాంశాలు, ముదిగొండ వీరభద్రయ్య, భావచిత్రం, ప్రతీక, అనువర్తిత విమర్శ.

## 1.ఉపోద్ఘాతం:

తెలుగులో తొలి, మలితరాలను సమన్వయిస్తూనే ఆధునిక విమర్శకు నూతన ద్వారాలు తెరిచిన విమర్శకులలో ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య ఒకరు. ఈయన తెలంగాణా రాష్ట్రానికి చెందినవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ తెలుగు చదివారు. ‘‘సామాజిక సాంస్కృతిక దృక్పథం గల కవిగా శ్రీశ్రీ’’

అన్న అంశంపై కాకతీయ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టా పొందారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్లగొండ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 24 సంవత్సరాలు అధ్యాపకునిగా పనిచేసిన తర్వాత యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్ లో అధ్యాపకునిగా చేరారు. ఇక్కడ 1998 నుండి 2004 వరకు తెలుగు శాఖలో అధ్యాపకులుగా, ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ కాలంలో ఆయన సాహిత్యవిమర్శకు సంబంధించిన అనేక మౌలికమైన రచనలు చేశారు. ఆ తర్వాత శ్రీసత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ (ఎస్.ఎస్.ఎస్.ఐ.హెచ్.ఎల్), అనంతపురంలో చాలాకాలంపాటు గౌరవ ఆచార్యులుగా పనిచేశారు. సాహిత్యంతో పాటు సంగీతం పట్ల ఆయనకు ఎంతో అభిరుచి ఉంది. ఆ అభిరుచి, లోతైన అవగాహన తెలుగులో కళాతత్వశాస్త్రం అనే ఒక కొత్తశాస్త్రం రూపొందడానికి సహరించింది. కేవలం సాహిత్యసౌందర్యాన్ని మాత్రమే కాకుండా, లలితకళల్లోని సౌందర్యాన్ని కూడా విశ్లేషించే శాస్త్రస్థాయి ఆలోచనలను 'కళాతత్వశాస్త్రం'గా రూపొందించారు. సుదీర్ఘకాలం పాటు హైదరాబాదు విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో తెలుగు సాహిత్యవిమర్శ, సంప్రదాయసాహిత్యం (ప్రాచీన-సాహిత్యం) కళాతత్త్వశాస్త్రం, రీసెర్చ్ మెథడాలజీ వంటి పాఠాలను ఎంతో శక్తివంతంగా, ప్రభావితం చేసేలా చెప్పేవారు. ఆయన పాఠాన్ని చెప్పేటప్పుడు సంస్కృత ఆలంకారిక సిద్ధాంతాలను, ఆంగ్లసాహిత్య-సిద్ధాంతాలను తులనాత్మకంగా వివరిస్తూ తెలుగు సాహిత్యవిమర్శను చెప్తుంటే సాహిత్యంలోని లోతుల్ని అంచెనా వేసే విధానాన్ని కొత్తగా ఆలోచించేలా చేసేది. ఆయన పాఠం చెప్పినా, సాహిత్యవిమర్శ రాసినా ప్రధానంగా మూడు పద్ధతులు గమనించవచ్చు.

1. సాధికారికంగా నిరూపించడం కోసం మూలాన్ని ప్రస్తావించడం,
2. దాన్ని ఇతర భాషల్లో కనిపించే అంశాల్ని తులనాత్మకంగా చూపించడం,
3. అనువర్తిత విమర్శ ద్వారా నిరూపించడం.

ఇవి చాలా కష్టమైన పద్ధతులు. చాలామంది సిద్ధాంతాన్ని చెప్పొచ్చు. కానీ, దాన్ని అనువర్తించి చెప్పరు. మరికొంతమంది ఆ భాషలోని భాగాన్ని విశ్లేషించవచ్చు. కానీ, దానిలోని సిద్ధాంతాన్ని చెప్పేవారు చాలా అరుదు. ఆ అంశాల్ని తులనాత్మకంగా విశ్లేషించి, దానిలోని గొప్పతనాన్ని నిరూపించి, ఒక నిర్ణయాన్ని ప్రకటించడం లేదా ఒక నిర్ణయానికి వచ్చేలా ఆలోచింపజేయడం వీరభద్రయ్య విమర్శలో కనిపించే ఒక విశేషం. ఆయన తెలుగు సాహిత్య విమర్శను బోధించడం, విశ్లేషించడంతోనే ఆగిపోలేదు. తెలుగు సాహిత్య విమర్శను పరిపుష్టం చేయడానికి విశేషంగా కృషి చేశారు.

## 2. ముదిగొండ వీరభద్రయ్య మౌలికకృషి:

తెలుగు సాహిత్యవిమర్శకు ప్రధానంగా కొన్ని నూతనాంశాలను అందించారని ఆయన విమర్శను లోతుగా అధ్యయనం చేసిన వారికి తెలుస్తుంది. వాటిని ఇలా క్రోడీకరించవచ్చు.

1. రాళ్ళపల్లి వారి తర్వాత కవి రచనల ద్వారా కవిజీవితరచన చేసినది వీరే. శివయోగి అనే వీరి రచన 1962లో ప్రచురితమయ్యింది.

2. విమర్శశాస్త్రమౌలికాంశాలను తెలుగు సాహిత్యక్షేత్రంలో మొదటగా అందించారు.
3. సౌందర్యశాస్త్రంగా వ్యవహరింపబడుతున్న దాన్ని కళాతత్వశాస్త్రంగా నామకరణం చేసి ఒక శాస్త్ర రూపంలోకి తెచ్చి దానిని అధ్యయన అధ్యాపనాలలోనికి మొదటిసారిగా తెచ్చారు.
4. మినీకవితను ఏకభావచిత్రాధారంగా దాని మినీత్వాన్ని నిర్ణయించాలని నిరూపించారు.
5. అలంకారశాస్త్రప్రస్థానాలను విమర్శకు ప్రమాణాలుగా తీసికోవాలని మొదటగా చెప్తూ శాస్త్రనిర్మాణం చేయడమే కాక వందలాది ఆధునికకవితలను కావ్యాలను ఆ ప్రమాణాలను అన్వయించి చూపారు.
6. ప్రఖ్యాత అగ్రశ్రేణి విమర్శకుల విమర్శలపై విమర్శగ్రంథాలు రాసి తెలుగులో అధివిమర్శ (Meta criticism)కు దారి వేసారు.
7. నవల నిర్మాణ సూత్రాలను పేర్కొంటూ పది మంది నవలావిమర్శకుల విమర్శల తీరు తెన్నులను వివరించారు.
8. భావచిత్రం, ప్రతీక, అధివాస్తవిక కవిత్వం, ఎలెగొరీలోపై సమగ్రపరిశీలన చేసి వ్యాసాలు రాశారు.
9. ప్రతీకకావ్యాలపై ఎంతో లోతైన విమర్శగ్రంథాలు రాసారు. గుంటూరు శేషేంద్రశర్మ 'నా దేశం నా ప్రజలు' (1975) డా. సి. నారాయణరెడ్డి 'మట్టీ-మనిషీ- ఆకాశం' (1998) మహా కావ్యాలపై వీరి విమర్శ గ్రంథాలు ఆ విమర్శ పంథాలో తెలుగు సాహిత్యక్షేత్రంలో మొదటివి.
10. పద్ధెనిమిది మంది అగ్రశ్రేణి తెలుగు సాహిత్యవిమర్శకుల విలక్షణతల గురించి ఇంగ్లీష్ Major Crtics Of Modern Telugu Literature (1998)లో ఒక పుస్తకం రాశారు. ఇదంతా తెలుగు సాహిత్య విమర్శలో ఇంతకు ముందు ఎవరూ చేయని పని. వీటిని అన్నింటినీ ఈ వ్యాసంలో వివరించడం కష్టం. అందువల్ల వీటిలో **కొన్ని అంశాలను ఐదు విభాగాలుగా చేసి** వివరించే ప్రయత్నం చేస్తాను.

### 2.1. తెలుగు సాహిత్య విమర్శకు మౌలిక అంశాలు, నూతన భావనలు, సిద్ధాంతాల రూపకల్పన:

తెలుగు సాహిత్యవిమర్శ అనగానే విమర్శ, విమర్శకుని లక్షణాలు, ప్రయోజనాలు, సాహిత్య విమర్శ పరిణామవికాసాలను, పాశ్చాత్యప్రభావాన్ని అధ్యయనం చేయడం ఒక సంప్రదాయంగా వస్తుంది. ఈ పరిస్థితుల్లో విమర్శకు సంబంధించిన కొన్ని మౌలిక అంశాలను ఆచార్య వీరభద్రయ్య 'విమర్శ- మౌలికలక్షణాలు' గ్రంథం ద్వారా తెలుగులో వివరించారు. దీనికోసం సంస్కృత, ఆంగ్ల, తెలుగు రచనలను వివిధ ఆకరాలుగా చూపించారు. ఈ గ్రంథంలో రాసిన విమర్శకు శాస్త్రప్రతిపత్తి అనే విషయం అంతకుముందు పెద్దగా చర్చలోకి రాని అంశం. అత్యంత ముఖ్యంగా విమర్శకు విశ్లేషణ, వ్యాఖ్యానం, తులనాత్మక పరిశీలన, నిర్ణయం అనే నాలుగు అంశాలు మౌలిక లక్షణాలుగా గుర్తించాలని ఈ గ్రంథం మనకు అందించిన ఒక ముఖ్యమైన సూత్రీకరణ. తెలుగు సాహిత్యవిమర్శను వాదోపవాదాల కోణం నుండి కూడా సూత్రీకరించడం తెలుగు సాహిత్య విమర్శ ఆరంభం, వికాసాలను సరైన కోణంలో అధ్యయనం చేయాలనే ఆలోచన కనిపిస్తుంది. దీనికోసం మను, వసు చరిత్రలపై వచ్చిన విమర్శలు గ్రంథరూపంలో పునర్ముద్రణ పొందడంలో ఆచార్య వీరభద్రయ్య కృషి విస్మరించలేనిది.

అంతకు ముందు ఆచార్య ఎస్వీరామారావు మను, వసు చరిత్రలపై వచ్చిన విమర్శను వారు తన తెలుగు సాహిత్యవిమర్శ గ్రంథంలో పేర్కొన్నారు. (తెలుగు సాహిత్యవిమర్శ, పుట:118-126) తెలుగు సాహిత్య విమర్శకు కూడా భారతీయ ఆలంకారిక సిద్ధాంతాలను సమన్వయించడమే ఒక శాస్త్రీయమైన విధానంగా నిరూపించారు. దీనిలో భాగంగానే కావ్య మూల్యాన్ని నిర్ణయించే విలువల నిర్ణయంపై మౌలికమైన అంశాలను అందించారు. కావ్యాత్మ సిద్ధాంతాలు, భారతీయ ఆలంకారిక ప్రస్థానాలు కావ్య విలువల నిర్ణయానికి ప్రమాణాలుగా, విమర్శ సూత్రాలుగా స్వీకరించవలసిన అవసరాన్ని ఎంతో సాధికారికంగా నిరూపించారు.

**''ఒక ప్రమాణం ఆలంకారికుల చేత ఏర్పరచబడిందంటే దాని వెనుక గాఢమైన, ప్రౌఢమైన, సయుక్తికమైన సాహిత్య వివేచన ఉన్నదనే అర్థం. ఏ ప్రమాణమూ అశాస్త్రీయ విధానంతో ఏర్పర్చబడలేదు. అప్పటి ప్రమాణాలు. కేవలం భారతీయ ప్రాచీన కావ్యాలకే కాక ఆధునిక కావ్యాలకీ, పాశ్చాత్యుల కావ్యాలకీ కూడా అనువర్తింపజేయగల్గుతుండడంతో అవి ఎంత శాస్త్రీయమైనవో ఆశ్చర్యకరంగా నిరూపణ అవుతున్నది.''** (విమర్శ, కళాతత్త్వ శాస్త్రాలు. పుట:83). ఇవి ఆధునిక వచన కవిత్వంలో కూడా ఎలా ఉన్నాయో అనువర్తిత విమర్శ ద్వారా కూడా నిరూపించారు.

ఇలా భారతీయ అలంకారికప్రస్థానాలను విమర్శకు ఒక ప్రధానమైన మౌలిక అంశంగా సూత్రీకరించడంతో పాటు, పాశ్చాత్య సిద్ధాంతాలు, విమర్శ ప్రమాణాలను సమీక్షించారు. పాశ్చాత్యుల ఇమాజినేషన్ భారతీయ ఆలంకారికుల ప్రతిభతోను, స్టైల్ ని రీతితోను సమానం అని నిరూపించారు. ఇలా ఆలంకారిక సాహిత్య విమర్శ పద్ధతులను లక్ష్య లక్షణ సమన్వితంగా చేయడం వల్ల ''విమర్శ - మౌలిక లక్షణాలు'' గ్రంథం ద్వారా ఆచార్య వీరభద్రయ్య తెలుగు సాహిత్య విమర్శలో ప్రతిపాదించిన మౌలికాంశాలకు నిదర్శనంగా నిలుస్తుంది.

### 2.2 సాహిత్య ప్రమాణాలను సిద్ధాంతీకరించడంలో సంప్రదాయ, ఆధునిక సిద్ధాంతాల సమన్వయం:

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య భారతీయ ఆలంకారిక సిద్ధాంతాలను ఎంత లోతుగా అధ్యయనం చేశారో పాశ్చాత్యసాహిత్యాన్ని కూడా అంతే లోతుగా పరిశీలించారు. కొన్ని సాహిత్యేతర ప్రమాణాలుగా కనిపించే వాటిలో సాహిత్య ప్రమాణాలు ఎలా అంతర్లీనంగా దాగి ఉన్నాయో తెలుగు విమర్శకుల సాహిత్య విమర్శను ఆధారంగా చేసుకుని నిరూపించారు. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, దువ్వూరి రామిరెడ్డి మొదలైన వారి భావాలను ఉదాహరిస్తూ వాటిని సాధికారికంగా నిరూపించారు. కొన్ని సాహిత్యేతరమైన ప్రమాణాలతో సాహిత్యాన్ని విలువ కట్టేటప్పుడు వచ్చే సమస్యలను కూడా గుర్తించారు.

**''కట్టమంచి వారు భావనాశక్తి విషయకంగా చేసిన ఆలోచన అంతా పాశ్చాత్యులు ముఖ్యంగా కాలరిడ్జ్ చేసిన ఇమేజినేషన్ మీద ఆలోచనతో సమానమైనది. అది మన అలంకార శాస్త్రాలలోని ప్రతిభతో సమానమైనది''** (విమర్శ, కళాతత్త్వ శాస్త్రాలు. పుట: 88)

**''ప్రాచీన అలంకారశాస్త్రం యూరోపు నుంచి మనకు అందిన కొన్ని సాహిత్య విమర్శ భావనలను కూడా తనలో ఇమిడించుకోవలసే ఉన్నది. ఇమేజిని మన అలంకారానికి అదనపు విషయ వివేచనగానూ, సింబల్ ని**

**మన ధ్వనికి అదనపు విషయంగానూ, పాత్ర చిత్రీకరణ, స్థల కాలైక్యతలను ఔచిత్యా విషయాంశాలుగానూ మనం తెలిగకానే అంగీకరించగల్గిన సామ్యం వాటిల్లో ఉన్నది**''(విమర్శ, కళాతత్త్వ శాస్త్రాలు. పుట: 89)

సంప్రదాయ, ఆధునికసిద్ధాంతాల సమన్వయంతో తెలుగు సాహిత్య విమర్శను అన్వయించవలసిన పద్ధతులను తెల్పడానికీ, వారి లోతైన అధ్యయనానికీ ఆచార్య వీరభద్రయ్య రాసిన 'తెలుగు సాహిత్యవిమర్శ: సాహిత్య, ఆలంకారిక పద్ధతి' అనే ఒక్క వ్యాసమే చాలు. దీనితో పాటు ఆధునిక కాలంలో సాహిత్యవిమర్శ-పద్ధతులుగా కొనసాగిస్తున్న విమర్శపద్ధతుల గురించి చేసిన వివేచన కూడా సంప్రదాయ, ఆధునిక సాహిత్యసిద్ధాంతాల సమన్వయమే కాదు, ఈ దిశగా కొనసాగించాల్సిన కృషిని కూడా ప్రేరేపిస్తుంది. అధివాస్తవికకవిత్వంపై ఆయన చేసిన విశ్లేషణ పాశ్చాత్యసాహిత్య సిద్ధాంతాల్ని తెలుగు సాహిత్య అనుశీలనకు ఉపయోగించుకోవాల్సిన సూత్రాల్ని వివరిస్తుంది. ఈ వ్యాసం ఆధ్యాత్మిక, కళాతత్త్వశాస్త్ర స్థాయిలో కళాసృజనా-నుభవాన్ని వివరిస్తుంది. సంప్రదాయ, ఆధునిక సిద్ధాంతాల సమన్వయంతో ఆచార్య వీరభద్రయ్య కృషికి తారాస్థాయి తెలుగులో ఆయన రూపొందించిన ''కళాతత్త్వశాస్త్రం''. బౌమ్ గార్టెన్, క్రోచీలతో మొదలు పెట్టి భారతీయ ఆలంకారికులైన భరతుడు, జగన్నాథ పండితరాయలు వంటి వారి కృషిని సమన్వయిస్తూ కొత్త శాస్త్రాన్ని తెలుగు సాహిత్యవిమర్శకు అందించారు. ఈ సందర్భంగా సంజీవ్ దేవ్ గురించి ఆయన చేసిన చేసిన కృషి అంతకు ముందెవ్వరూ చేయలేదు.

### 2.3 కవిత్వానికే కాకుండా, కథానిక, నవలలకు కూడా అనువర్తిత విమర్శతో ప్రామాణిక సూత్రీకరణలను అందించడం:

తెలుగులో సాహిత్యచరిత్రనిర్మాణం ప్రధానంగా కవిత్వాన్నికేంద్రంగా చేసుకొనే కొనసాగింది. ఇంచుమించు అదే పద్ధతి సాహిత్య విమర్శ రంగంలోనూ కనిపిస్తుంది. తొలితరం విమర్శకులు కవిత్వాన్ని విశ్లేషించడానికి ఇచ్చినంత ప్రాధాన్యాన్ని కథానికలు, నవలలు, నాటకాలను విశ్లేషించడానికి ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో మలితరం విమర్శకుల్లో కవిత్వంతో పాటు కల్పనా సాహిత్యానికి కూడా ప్రాధాన్నివ్వడం మొదలు పెట్టారు. నవలా విమర్శకులు పై వీరభద్రయ్య మూసీ మాసపత్రికలో ధారావాహికంగా పదిమంది విమర్శకుల పద్ధతులపై విమర్శ రాశారు. ఆ పది మంది పేర్లు ఇవి. డా॥ సి. ఆనందారామం, కోడూరి శ్రీరామమూర్తి, డా॥ సంజీవమ్మ, డా॥ ముదిగంటి సుజాతా రెడ్డి, డా॥ మాదిరాజు రంగారావు, డా॥ భూమయ్య, వల్లంపాటి వెంకటసుబ్బయ్య, డా॥ మృణాళిని, డా॥ నరసింహ రాఘవన్, డా॥ విద్యేశ్వరి.

ఆచార్య వీరభద్రయ్య 'విమర్శ-మౌలికలక్షణాలు' గ్రంథంలోనే రావిశాస్త్రి 'తప్పు' కథను విశ్లేషించి, కల్పనా సాహిత్య అనువర్తిత విమర్శకు ఒక మార్గం చూపించారు. నవల విమర్శకులు గ్రంథాన్ని గురించి ఆ రంగంలో విస్తృతంగా విమర్శ వెలువరించిన ఆచార్య సి.మృణాళిని వ్యాఖ్యానిస్తూ-

"**నవలకు కూడా ఒక నిర్దిష్టమైన 'పొయెటిక్స్' ఉంటుందని, ఆ దిశగా విమర్శకుల ప్రయాణం సాగాలని ఈ పుస్తకం మనకు గుర్తుచేస్తుంది**'' అని అన్నారు.

ఈ అభిప్రాయం నవలాసాహిత్య విమర్శపై వీరభద్రయ్య విమర్శలోని మౌలికాంశాలను తెలుపుతుంది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం అభిప్రాయంలో-

**"అనువర్తిత విమర్శకునికి ఉండవలసినవి ఆరు లక్షణాలు. అవి:- 1. సాహిత్య చరిత్రలోని పరిణామ వికాసదశలను గురించిన నిర్దుష్టమైన అవగాహన ఉండటం. 2. కొత్తను చూచి మెచ్చుకోవటమే కాక విలువకట్టగలిగే వివేచన కలిగి ఉండటం. 3. సామాన్య, సాపేక్ష లక్షణ వివేకం. 4. సాహిత్య దర్శన ప్రవృత్తిమీద ప్రామాణిక భావం. 5. విశ్లేషణ, అనుశీలన ప్రజ్ఞా పాటవం. 6. పూర్వాపర విమర్శ దృక్పథాల సమన్వయశక్తి, అవసరమైతే ఖండన శక్తి"** ఇవన్నీ ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య విమర్శలో ఉన్నాయని 'విద్యుత్ చైతన్యం గల విద్వద్రచన' పేరుతో 'కళాతత్త్వశాస్త్రానికి రాసిన పీఠికలో వివరించారు.

ఆచార్య వీరభద్రయ్య కవిత్వంతో పాటు నవలలు, కథలను కూడా అనువర్తిత విమర్శచేశారు. 'రూపకాత్మక రచన 'ఎలెగొరి', 'కొన్ని రూపకాత్మక కథలు' వ్యాసాల్లో విశ్వనాథ సత్యనారాయణ 'పులుల సత్యాగ్రహం' నవలను, చలం 'ఓపువ్వుపూసింది', రావిశాస్త్రి కథల్నీ విశ్లేషించారు. వాకాటి పాండురంగారావు 'శివాన్విత' కథను కూడా మరో వ్యాసంలో వివరించి, వీటన్నింటినీ కావ్యం, కవిత్వం స్థాయి ఎంత గొప్పదో, అంతే స్థాయిలో పాఠకులు అవగాహన చేసుకోవాలనే అభిప్రాయం కలిగేలా ఆ ప్రక్రియల పట్ల అభిమానాన్ని కలిగిస్తారు. ఈ అభిప్రాయాన్ని చూడండి.

**''ప్రధానంగా కవిత్వంలోనిదే ఐనప్పటికీ ఎలెగొరీ అన్య ప్రక్రియలలో కూడా తన పనిని చేయగల్గుతున్నది. విధానాలలో మాత్రం కాస్త భేదం ఉంటుంది. కథల్లో, నవలల్లో ఎలెగొరిని వాడినప్పుడు దాని అంతరార్థం ఏమిటని తెలిపే కీలకాలని కొద్ది కొద్దిగా కాని, విస్తృతంగా కాని తెలుపవచ్చును. కథలల్లో ఎలెగొరీని వాడిన కొందరు కథారచనకు కూడా కవిత్వ స్థాయిని తెచ్చారు.''** (విమర్శ, కళాతత్త్వ శాస్త్రాలు. పుట: 317)

వేయిపడగలు, రావిశాస్త్రి ధర్మేతిహాసం - మూడు కథల బంగారం, నవల- నవలా విమర్శకులు, బుచ్చిబాబు చివరకు మిగిలేది నవల- జిడ్డు కృష్ణమూర్తి తత్త్వం మొదలైన రచనలు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య కథానిక, నవలా సాహిత్య విమర్శకు చేసిన గొప్పకృషిని తెలియజేస్తాయి. తెలుగు సాహిత్య విస్తృతినీ, వివిధ ప్రక్రియలను ఆహ్వానించడంలో శాస్త్రీయమైన ఆలోచననీ ఈ విమర్శకృషిలో గమనించవచ్చు. వెన్నేటి రామచంద్రరావు, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, పి.దక్షిణామూర్తి, వింజమూరి రంగాచార్యులు, కట్టమంచి, దువ్వూరి రామిరెడ్డి, రాళ్ళపల్లి, విశ్వనాథ, శ్రీశ్రీల సాహిత్య విమర్శ కృషిని వివిధ వ్యాసాలలో సందర్భాలలో వివరించారు.

### 2.4 సాహిత్యవిమర్శ, విమర్శకులపై విమర్శ చేసి, దాన్ని అధివిమర్శ (మెటాక్రిటిసిజమ్)గా పేరుపెట్టి భావజాలంతో నిమిత్తం లేకుండా, ఆబ్జెక్టివ్ గా విమర్శ కొనసాగించే పద్ధతిని చూపించడం:

విమర్శ ప్రశంస నుండి విమర్శస్థాయికి చేరుకోవాలంటే ఆబ్జెక్టివిటీ అత్యంతముఖ్యం. స్వపరభేదం లేకుండా విషయం మీదే దృష్టిని కేంద్రీకరించాలి. వేమన సాహిత్యాన్ని కవిజీవిత కావ్య సమన్వయ విమర్శతో రాళ్ళపల్లి వారు ఒక మార్గం వేయగా దాన్ని అందిపుచ్చుకుని వీరు 1962 లోనే ఈ విమర్శ శాఖ లో శివయోగి అనే గ్రంథాన్ని రాశారు. వీరు ఆంగ్లంలో రచించిన 'ది మేజర్ క్రిటిక్స్ ఆఫ్ మోడర్న్ తెలుగు లిటరేచర్' గ్రంథం

తెలుగు సాహిత్య విమర్శకుల వివిధ దృక్పథాలను తెలియజేసేలా ఉంది. వారిని ఎన్నుకోవడంలో ఏదో ఒక భావజాలానికి మాత్రమే పరిమితం కాకుండా తెలుగు సాహిత్య విమర్శలో మైలురాళ్ళుగా గుర్తించదగిన కృషి చేసిన వారిని నిష్పాక్షికంగా వివరించారు. విశ్వనాథ, ఆర్.ఎస్. సుదర్శనం, జి.వి.సుబ్రహ్మణ్యం, గుంటూరు శేషేంద్రశర్మ, చేకూరి రామారావు, వడలి మందేశ్వరరావు, కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమార, ఆరుద్ర, ఎస్వీరామారావు, తుమ్మపూడి కోటీశ్వరరావు, పోరంకి దక్షిణామూర్తి, అద్దేపల్లి రామమోహన్ రావు, రాచమల్లు రామచంద్రారెడ్డి, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కె.వి.రమణారెడ్డి, జి.లక్ష్మీనరసయ్య, శ్రీశ్రీల గురించి ఈ గ్రంథంలో వివరించారు. చేకూరి రామారావు భాషాశాస్త్రదృష్టితో కవిత్వాభివ్యక్తిని వివరించిన విధానం వంటిదే జి.లక్ష్మీనరసయ్య కృషి కూడా. అయితే, ఈయన భాషాదృష్టితో కాకుండా కవిత్వనిర్మాణపద్ధతుల పేరుతో వచనకవిత్వాభివ్యక్తిలో వివిధ పద్ధతులను విశ్లేషించారు. ఈ ఇరువురి కృషిని సాధికారికంగా పరిచయం చేసి, తెలుగుసాహిత్య విమర్శలో వీరి కృషిని గ్రంథస్థం చేసినవారు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్యే. ఈ గ్రంథంలో తెలుగు సాహిత్యవిమర్శకుల పద్ధతులు, వారి దృక్పథాలు, వారు ఎన్నుకున్న విమర్శప్రమాణాలను ఎంతో ఆబ్జెక్టివ్ గా విశ్లేషించారు. దీని ద్వారా భిన్నభావజాలాలు ఉన్నప్పటికీ నిజమైన విమర్శకులు ఆ రచనాతత్వం పైనే కేంద్రీకరించాలిగానీ, ఆ వ్యక్తుల భావజాలంతో విమర్శ చేయకూడదనే ఒక ఉత్తమ విమర్శ ప్రమాణాన్ని ఈ గ్రంథం ద్వారా అందించారు.

### 2.5 భావచిత్రం, ఎలిగొరి, ప్రతీకలతో ఆధునిక వచన కవిత్వాన్ని విశ్లేషించే మార్గం. (అనువర్తిత విమర్శ మార్గం):

‘‘**విమర్శకులలో కొందరు సిద్ధాంతాలూ, సూత్రాలూ నిర్మిస్తారేకాని వాటిని అనువర్తించి చూపటంలో శ్రద్ధచూపించరు. మరికొందరు అనువర్తిత విమర్శనుండి సాపేక్ష విమర్శసూత్రాలను నిర్మిస్తారు. కొందరు ప్రసిద్ధ విమర్శసూత్రాలకు లక్ష్యాలుగా కావ్యార్థాలను వివేచిస్తారు. వీరందరూ ఒక ఎత్తు. ప్రక్రియను బట్టి,ప్రయోగాన్ని బట్టి విమర్శవిధానాన్ని రూపొందించుకోవాలని భావించే అనువర్తిత విమర్శకులు మరొక ఎత్తు. డాక్టర్ వీరభద్రయ్య ఈ చివరికోవకు చెందుతారు**’’ అని ‘మట్టీ-మనిషీ-ఆకాశం’ కావ్యాన్ని విమర్శిస్తూ రాసిన గ్రంథానికి ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం రాసిన ముందుమాటలో అన్నారు.

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య విమర్శలో సిద్ధాంతం ఎంత ముఖ్యమైందో, దాన్ని అనువర్తించి చూపించడం, విలువల్ని నిర్ణయించడం కూడా అంతే ముఖ్యంగా కనిపిస్తుందని ఈ అభిప్రాయం స్పష్టం చేస్తుంది. సుమారు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యాన్ని, ముఖ్యంగా ఆధునిక వచనకవిత్వాన్ని ఎంతో ప్రభావంతంగా వీరు వివరించారు. ఇప్పటి సాంకేతికత అప్పుడు లేకపోయినా ప్రొజెక్టర్ ద్వారా ఫిల్మ్ లపై కవిత్వాన్ని రాసి స్లైడ్స్ వేసి ఒక్కో వచన కవితను వివరిస్తూ, దానిలోని అలంకారం భావచిత్రంగా, ప్రతీకగా మారిన తీరుతెన్నుల్ని వివరిస్తుంటే సాహిత్యాన్ని అధ్యయనం చేసేవాళ్ళు ఆశ్చర్యచకితులయ్యేవారు. ఇదే విషయాన్ని ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య వివరిస్తూ ‘ఆలోచన, ఆలోకన’ అనే గ్రంథానికి ముందుమాట రాస్తూ ఇలా అన్నారు.

**"శాస్త్రీయమయిన సాధనాలను, పద్ధతులను ఉపయోగించుకొని వీరభద్రయ్య ఈ కవితలలోని సింబల్స్ ను ఇమేజెస్ లను ఎట్లా గుర్తుపట్టాలో. ఎట్లా అవగాహనచేసుకోవాలో చెప్పటం మాత్రమే కాదు, నిర్విరామంగా ఊళ్లు తిరిగి ప్రచారంచేశాడు. చాలా సభలకు స్లైడ్స్, పాజెక్టర్ తీసుకెళ్లి ఇంచుమించుగా Practicallessone' ఇవ్వటం నేను ప్రత్యేకంగా ఎరుగుదును. రాజమండ్రిలో ఆ మధ్యజాతీయ సాహిత్య పరిషత్తు వార్షిక సభలలో ఆయన ప్రదర్శనోపన్యాసం ఎందరికో ఈ కొత్త కవిత్వావగాహన కలిగించింది"** (కోవెల సంపత్కుమారాచార్య, పుట:) ఈ సభలో నేను కూడా (ఈ వ్యాసకర్త) కూడా పాల్గొన్నాను.

ఆచార్య వీరభ్రద్రయ్య ప్రసంగమంటేనే భావచిత్రాన్నో, ప్రతీకనో విశ్లేషించే విధానాన్ని తెలుసుకొనే ఒక పాఠంగా భావించేవారు. ఆ వ్యాసాలను వివిధ గ్రంథాల్లో పొందుపరిచారు. ప్రతీకలో కన్పించే ప్రధానాంశాలను గురించి ఆచార్య వీరభద్రయ్య ఈ విధంగా చెప్పారు. 1) ప్రాతినిధ్యం, 2) సంబంధం, 3) తత్త్వదర్శనం, 4) సంకేతితార్థంకాదు. 5) సామ్యసిద్ధి అతార్కికం, 6) భౌతిక వాస్తవం ఆధ్యాత్మిక వాస్తవంతో ముడిపడి ఉంటుంది. 7) అర్థగూఢతా స్పష్టతలు రెండూ ఉంటాయి, 8) ప్రతీకలో నిర్దిష్టార్థం లక్ష్యం కాదు 9) పౌరాణిక పదజాలం, 10) రెండు భావచిత్రాలు ప్రక్కప్రక్కన ఉంచినంతమాత్రాన అది ప్రతీక కాదు. ప్రతీకతత్త్వాన్ని వచనకవిత్వంతో అనువర్తించి చూపడంలో తెలుగు సాహిత్య విమర్శకు కొన్ని మౌలిక భావనలను అందించారు. తెలుగు అకాడమీ వారు 'విమర్శ, కళాతత్వశాస్త్రాలు' పేరుతో తీసుకొచ్చిన పుస్తకంలో వీరభద్రయ్య సాహిత్య విమర్శకు సంబంధించిన విమర్శ మౌలిక లక్షణాలు, కళాతత్త్వ శాస్త్రం, సూత్రం - అన్వయం మొదలైన గ్రంథాలను చేర్చారు. నాకు తెలిసి తెలుగులో తొలిసారిగా వేదాల్లోను, బైబిలులోను ఉన్న ప్రతీకలను శాస్త్రీయంగా విశ్లేషించి, వాటిలోని సాహిత్య విలువల్ని, వాటిని అవగాహన చేసుకొనే కొత్త విధానాల్ని చెప్పింది వీరభద్రయ్యగారే. ఒక కవిత దానిలోని వస్తువు, దానిలోని శిల్పం, రెండింటిలో దేనివల్ల కవిత్వమవుతుందో, దేని ప్రభావం పాఠకునిపై శాశ్వతమైన ముద్రవేస్తుందో ఆయన విశ్లేషించిన అనేక కవితలను బట్టి చెప్పవచ్చు. గుంటూరు శేషేంద్రశర్మ, ఇస్మాయిల్ లను ఎంత ఇష్టపడతారో, ఇతర కవుల్లో ఉండే అనేకాంశాలను గమనిస్తే వారిని కూడా అంతే ఇష్టపడతారు. వీరభద్రయ్య చాలామందికి సరిగ్గా తెలియని సమకాలీన, వర్తమాన వచనకవుల కవితల్లోని గొప్పతనాన్ని విశ్లేషించి చూపించారు. ప్రతీక,భావచిత్రం, ఎలిగొరిలకు నేటికీ సవివరమైన లక్షణాలు, అన్వయ విధానం తెలియాలంటే ఈయన రాసిన వ్యాసాల్ని చదవాల్సిందే.

### 3. ముగింపు:

తెలుగు సాహిత్య విమర్శకు ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య చేసిన మౌలిక కృషిని తెలియజేసే అంశాలు ఇలా ఎన్నో ఉన్నాయి. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య వంటివారెందరో ఈయన సాహిత్య విమర్శ కృషిని, మౌలికతను ప్రశంసించారు. తెలుగు సాహిత్య విమర్శ శాస్త్రస్థాయిలో రావడానికీ, అనువర్తిత సూత్రాన్వయానికీ వీరు చేసిన కృషి ఎంతోమంది యువ సాహితీ విమర్శకులకు ఆదర్శనీయంగా నిలుస్తుంది. భారతీయ ఆలంకారిక సిద్ధాంతాల్లోని ఔన్నత్యాన్ని పునర్మూల్యాంకన దృష్టితో చూస్తే, సాహిత్య విలువల నిర్ణయానికి అవెంతగా ఉపయోగపడతాయో ఆచార్య

ముదిగొండ వీరభద్రయ్య సాహిత్య విమర్శ మనకు స్పష్టం చేస్తుంది. ఈ దిశగా ఆయన చేసిన సాహిత్య విమర్శ కృషిని కొద్దిగా వివరించే ప్రయత్నాన్ని ఈ వ్యాసంలో అందించాను.

### 4. ఉపయుక్తగ్రంథసూచి:


1. రామారావు, ఎస్వీ. (2014). తెలుగులో సాహిత్యవిమర్శ అవతరణ – వికాసములు. పసిడి ప్రచురణలు: హైదరాబాద్.
2. లక్ష్మణచక్రవర్తి, సి.హెచ్, పి వారిజారాణి, జి. విజయ కుమార్ (సంపా). ఆధునిక సాహిత్య విమర్శకులు ప్రస్థానాలు, (తొలి మలితరాలు). (2018). ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్సర తెలుగు శాఖ: హైదరాబాద్.
3. లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్., పి. వారిజారాణి, జి. విజయ కుమార్ (సంపా). ఆధునికసాహిత్య విమర్శకులు ప్రస్థానాలు, (సమకాలికులు) (2018). ఆంధ్రవిద్యాలయస్నాతకోత్సర తెలుగుశాఖ: హైదరాబాద్.
4. వీరభద్రయ్య, ముదిగొండ. (2012). విమర్శకళాతత్త్వశాస్త్రాలు. తెలుగుఅకాడమీ: హైదరాబాద్.
5. Veerabhadraiah, Mudigonda. Major Crtics of Modern Telugu Literature. Pallavi Publications: Vijayawada.


***

**గమనిక:** ఈ పత్రికలోని వ్యాసాలలో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి.
వాటికి సంపాదకులు గానీ, పబ్లిషర్స్ గానీ ఎలాంటి బాధ్యత వహించరు.